క్లుప్తంగా

కస్తూర్బా పాఠశాలకు పుస్తకాల విరాళం



నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి జహీరాబాద్‌కు చెందిన డాక్టర్ శివబాబు పుస్తకాలను విరాళంగా అందచేశారు. పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి సోమవారం పుస్తకాలను విద్యాలయం ప్రిన్సిపల్ ప్రమీలారాణికి అందచేశారు. నీతి కథలు, మహనీయుల జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను అందచేసినట్టు చినరామిరెడ్డి తెలిపారు. కాగా అద్దంకి చెందిన జ్యోతి చంద్రమౌళి పాఠశాలను సందర్శించి పుస్తకాలను విరాళంగా అందించేందుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు.

కంటి చూపును పరిరక్షించుకోవాలి



చిలకలూరిపేట: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి చూపును పరిరక్షించుకోవాలని ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ చిలుకూరి శ్రీరామమూర్తి చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం ఎన్నో ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చిన కారణంగా ఆపరేషన్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 364 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 63 మందిని ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 250 మందికి కళ్లజోళ్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చింతన్, డాక్టర్ కమల, క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు తోటకూర వెంకట నారాయణ, కారుమంచి శివరావు, గళ్లా సాంబశివరావు, గోగినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకేర్‌లో అరుదైన శస్త్ర చికిత్స



నరసరావుపేట: పట్టణంలోని వినుకొండరోడ్డులో గల శ్రీ కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స చేసి ఓ రోగి శరీరం నుంచి 10కేజీల గడ్డను తొలగించినట్లు హాస్పిటల్ ఎం.డి డాక్టర్ గద్దం శ్రీకాంత్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి విపరీతమైన కడుపునొప్పితో తమ వైద్యశాలలో చేరారని, స్కానింగ్ చేసి చూడగా అతని పొట్టలో గడ్డ ఉన్నట్లుగా గుర్తించామన్నారు. శస్త్రచికిత్స చేసి తొలగించాల్సిన పరిస్థితులను రోగికి వివరించి ఆపరేషన్ చేసి గడ్డను తీసివేయటం జరిగిందన్నారు. దీంతో ఆ రోగి ఉపశమనం పొందారన్నారు. రోగి కుటుంబ సభ్యులు డాక్టర్ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

రూరల్ సీఐ సుధాకర్

శావల్యాపురం: ఎన్నికల కోడ్ అమల్లో ఉందని రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలందరు అధికారులకు సహకరించాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని కారుమంచి గ్రామంలో కేంద్ర పోలీసు బలగాల సారధ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని గ్రామాల్లో ఫెక్సీలు తొలగింపుతో పాటు తిరునాళ్ల తదితర కార్యక్రమాలు అన్నీ నిషేధమన్నారు. గ్రామాల్లో గొడవలు అల్లర్లు సృష్టించకుండా ఉండేలా అసెంబ్లీ ఎన్నికల పూర్తి అయ్యే వరకు గ్రామాల్లో పోలీసు నిఘా పటిష్టంగా ఉంటుందన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సమయనం పాటించి ఎన్నికల సజావుగా జరిగేలా తమ వంతు పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో కేంద్ర బలగాలచే 100 మంది పోలీసులు తుపాకులతో కవాతు నిర్వహించారు. ఆయనతో పాటు కేంద్ర బలగాల సర్కిల్ ఇన్‌స్పెక్టరు మీనా, ఎస్సై చల్లా సురేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎన్నికల నియమావళిపై సమావేశం


నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 4 గంటలకు బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల సిబ్బందికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఈఆర్‌వో డీవీవీ వరకుమార్ చెప్పారు. సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అభివృద్ధికి కేరాఫ్ వేల్పూరు

- జగనన్న హయాంలో రూ. 30 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల రూపంలో రూ. 40 కోట్ల లబ్ధి



శీతల గిడ్డంగి కేంద్రం



శావల్యాపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో వేల్పూరు గ్రామం అభివృద్ధి దిశగా పరుగులు తీసింది. గ్రామానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే బొల్లా సారథ్యంలో శ్రీకారం చుట్టి వాటిని సాకారం చేశారు. ప్రధానంగా అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలతో పాటు మరోవైపు అభివృద్ధి పనులు చేసుకుంటు ప్రజల మన్ననలు పొందారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా స్వగ్రామంలో వేల్పూరు గ్రామ పంచాయతీలో కోట్లు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో మోడల్ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనశక్తి వంచన లేకుండా గ్రామస్తులు సహకారంతో కృషి చేశారు. అలాగే సంక్షేమ పథకాలు అమలు తీరులో పార్టీలు కులమతాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయి.

చేసిన అభివృద్ధి పనులు

- రూ. 2 కోట్లు 85 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ. కోటి రూపాయల వ్యయంతో గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ క్లినిక్ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు
- ఎస్సీ, బీసీ కాలనీలో సైడు డ్రెయిన్ల నిర్మాణ పనులు రూ. 40 లక్షలు
- గంటావారిపాలెం నుంచి వేల్పూరుకి వెళ్లే 3 కిలోమీటర్ల రహదారి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ.10 లక్షలు సొంత నిధులు, ప్రభుత్వ నిధులు రూ.20
- జలజీవన్ మిషన్ పథకానికి రూ.కోటి 80 లక్షలు
- రూ. 4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- 3 వేల మెట్రిక్ టన్నులు కోల్డ్ స్టోరేజ్ (శీతల గిడ్డంగి కేంద్రం) రూ. 6 కోట్లు
- పేదలందరికీ ఇంటి నివేశిత స్థలాలకు సంబంధించి 11 ఎకరాలు భూమి రూ. ఒక కోటి 32 లక్షల వ్యయంతో 401 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషను ధ్రువీకరణ పత్రాలు అందజేత
- గ్రామంలో గంగమ్మ దేవాలయం నిర్మాణ పనులు ప్రభుత్వ పరంగా రూ.10 లక్షలు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ.5 లక్షలు
- చెన్నకేశవ దేవాలయం నిర్మాణ పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు నుంచి రూ.47 లక్షలు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ.23 సొంత నిధులతో అభివృద్ధి
- గంటావారిపాలెం, వేల్పూరులో ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.13 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్లు నిర్మాణ పనులు పూర్తి
- రూ.3 లక్షల 50 వేలు నిధులతో హిందూ శ్మశాన వాటిక నిర్మాణం
- పొలాలకు అంతర్గత రహదారులు 10 కిలోమీటర్ల వరకు రూ.25 లక్షల వ్యయంలో పనులు చేశారు.
- నాడు-నేడు మన బడి పథకంలో భాగంగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు రూ.60 లక్షలు వ్యయంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- వేల్పూరులో రెండు గ్రామ సచివాలయాలు నిర్మించారు.



వేల్పూరు గ్రామానికి వెళ్లే రహదారి



విద్యుత్ సబ్ స్టేషను



ఎన్నెస్పీ కెనాల్ పక్కనే నిర్మించిన సీసీ రోడ్డు

జగనన్నకు రుణపడి ఉంటాం



సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల మాదిరిగా పరిగెత్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో మా గ్రామ పంచాయతీ తరుపున మేం ఎంతో రుణపడి ఉంటాం. గ్రామంలో గతంలో ఎన్నడూ చేయని విధంగా ఎమ్మెల్యే బొల్లా అభివృద్ధి పనులు చేపట్టి జన్మభూమి రుణం తీర్చుకున్నారు.

–స్వర్ణాల వెంకట్రావు యాదవ్, వేల్పూరు

జగనన్న సారథ్యంలోనే...



జగనన్న–బ్రహ్మన్న సారథ్యంలో వేల్పూరు గ్రామ పంచాయతీలో పార్టీలకు కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేశాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేయనటు వంటి అభివృద్ధి పనులు గ్రామస్తులు సహకారంతో చేశాం. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందజేయటం ప్రభుత్వ తీరుకు నిదర్శనం.

–ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఎంపీపీ

నేడు ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ పర్యటన

వినుకొండ (నూజండ్ల): వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డా. అనిల్ కుమార్ యాదవ్, బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి పాల్గొంటున్నట్లు కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు వినుకొండ రూరల్ కోటప్ప నగర్ గ్రామం మీదుగా పెదకంచెర్ల, ఏనుగుపాలెం, పిట్టంబండ, ఉమ్మడివరం, నాగులవరం, గోకనకొండకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

వినుకొండ టౌన్: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించి, నిర్వహణ తీరుతెన్నులను గ్రంథాలయ అధికారి బద్రీనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నించే వారికి, సమాజంపై అవగాహన పెంపొందించుకునే వారికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడతాయన్నారు. అటువంటి గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

కనుమలచెరువులో ఫ్యామిలీ డాక్టర్

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టరు ఫిజీషియన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యులు వి.సాయితేజ, ఆధ్వర్యంలో వైద్య చికిత్సలు అందజేశారు. గ్రామంలో సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి రక్త పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు పంపిణీ చేశామన్నారు. ఫ్యామిలీ వైద్యుడు ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రత్యేకంగా రోగులకు ఇంటికే మందులు సరఫరా ఉంటుందని చెప్పారు. పీహెచ్‌సీలో కావల్సిన మందులు అందుబాటులోని పక్షంలో రోగులు తమకు అవసరమైన మందులను ముందుగా ఎంఎల్‌హెచ్‌పీ, కాని పీహెచ్‌సీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయా మందులను రోగులకు నేరుగా ఇంటికే సరఫరా చేస్తామని, ఈ గ్రామంలో 20 మంది దీర్ఘకాలిక వ్యాధులకు మందులకు పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో తొలిరోజు 23 మంది గైర్హాజరు

- వేర్వేరు ప్రాంతాల్లో డీఈవో పర్యటన
- పది పరీక్షలు ప్రశాంతం

యడ్లపాడు: విద్యార్థి జీవితంలో తొలిసారిగా ఆరంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. మండలంలో పది జెడ్పీహైస్కూల్స్, ఒక గురుకుల పాఠశాల, 5 ప్రైవేటు హైస్కూల్ ఉన్నాయి. వీటి పరిధిలో 2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు 620 మంది ఉండగా, వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 480 మంది, సప్లిమెంటరీ రాసేవారు 140 మంది ఉన్నారు. ఈ ఏడాది మండల కేంద్రమైన యడ్లపాడులోని 3 పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, చీఫ్ ఆఫీసర్ ఒకరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం కానుండగా గంటముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలిరోజు పరీక్షకు 23 మంది గైర్హాజరయ్యారు. జిల్లా డీఈవో వెంకటేశ్వర్లు సోమవారం హైస్కూల్ కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: మండలం కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా 274 మంది విద్యార్థులకు గాను 263 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్స్ ఇనిగంటి సునీల్‌చౌదరి, డిపార్టుమెంటల్ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎస్సై చల్లా సురేష్ సారథంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, పోలీసు బందోబస్తు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య, రాజుపాలెం మండలం ఎంఈవో డి.మల్లిఖార్జున శర్మ, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు సందర్శించి మౌలిక వసతులు ఏర్పాట్లుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనాయి. పరీక్షలకు వెళుతున్న విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు తగు సూచనలు, సలహాలు ఇచ్చి ధైర్యం చెప్పి పరీక్షలకు పంపారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులు దేవాలయాలకు వెళ్లి ఇష్టమైన దైవాలకు పూజలు చేసి అనంతరం పరీక్షలకు వెళ్లారు. పరీక్షా కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసిన నోటీస్ బోర్డులో ఉన్న నెంబర్లను చూసి విద్యార్థులు తమకు కేటాయించిన గదులకు వెళ్లారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీటి సౌకర్యం, వైద్య సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. మొదటి రోజున మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 510 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 501 మంది విద్యార్థులు హాజరయ్యారు. 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

వినుకొండలో

వినుకొండ టౌన్: తెలుగు భాషతో 10వ తరగతి పరీక్షలు ప్రారంభమైనట్లు ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా సోమవారం తెలియచేశారు. మొత్తం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 130 మంది ఇన్విజిలేటర్లు విధులకు హాజరయ్యారన్నారు. తొలి రోజు 11 పరీక్షా కేంద్రాలలో 2,087 మంది విద్యార్థులు హాజరు కాగా 45 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: సాతులూరు, చిరుమామిళ్ళ, నాదెండ్ల ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సాతులూరులో 241 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరయ్యారు. చిరుమామిళ్ళలో 192 మందికి గాను ముగ్గురు, నాదెండ్లలో 113 మందికి గాను ఒక్కరు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరిగాయి. 8.45 గంటలకే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. వివిధ గ్రామాల నుంచి పరీక్షా కేంద్రాల వరకూ ఆర్టీసీ బస్సులు ఉచితంగా నడిచాయి. సాతులూరు ఉన్నత పాఠశాలకు చీఫ్‌సూపరింటెండెంట్‌గా వీరయ్య, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎం గురుబ్రహ్మం, చిరుమామిళ్ళ పాఠశాలకు కె.వేణుగోపాలరావు, టి.వెంకటేశ్వర్లు, నాదెండ్లకు ఐ జానకీధర్, ఎం నవీన్‌కుమార్ వ్యవహరించారు. ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పది పరీక్షలకు విద్యార్థులు కేటాయించిన కేంద్రాలకు చెరుకుని అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించారు. విద్యార్థుల ప్రవేశానికి ముందుగా తనిఖీ అనంతరం లోపలికి అనుమతించారు. మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, బండ్లమోటు ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటుచేశారు. ఆయా పరీక్షా కేంద్రాలకు తొలిరోజు పది విద్యార్థులు 409 మందికి గాను 393 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ 2 కె పార్వతి ఈ మేరకు తెలిపారు.

రొంపిచర్లలో ఆర్‌జేడీ పర్యటన

రొంపిచర్ల: పదవ తరగతి పరీక్షలు జిల్లాలో 125 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. పరీక్షలు నిర్వహించేందుకు పక్కా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. క్యూఆర్ కోడ్‌తో పరీక్షా పేపర్లు విద్యార్థులకు అందజేస్తామన్నారు.



యడ్లపాడులో నంబర్లను పరిశీలిస్తున్న పిల్లలు



శావల్యాపురంలో పరీక్ష కేంద్రంలో సీరియల్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



రొంపిచర్లలో నోటీస్ బోర్డులో పరీక్ష నంబర్లను చూసి తమ పిల్లలకు తెలియజేస్తున్న తల్లిదండ్రులు



వినుకొండలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



రొంపిచర్ల జెడ్పీ హెచ్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రం వద్ద ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే అంతిమలక్ష్యం

- వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు
- మైదవోలు, కొండవీడు గ్రామాల్లో పర్యటన
- పరిచయ వేదిక, ఆత్మీయ సమావేశాల నిర్వహణ

యడ్లపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కొండవీడు, మైదవోలు గ్రా మాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం రెండు గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. వారినుంచి గ్రామంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. అనంతరం మనోహర్ నాయుడు మాట్లాడుతూ చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ పోటీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనను ప్రతిపాదించారని, ఆయన ఆదేశాల మేరకు పోటీ బరిలో ఉన్న తనను పార్టీ శ్రేణులంతా సమన్వయంతో గెలిపించాలని అభ్యర్థించారు. త్వరలోనే చిలకలూరిపేటలోనే స్థిర నివాసం ఏర్పరచుకోవాలని నిత్యం పార్టీ వర్గీయులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. ముందుగా కొండవీడు గ్రామంలోని దాదాపీర్ దర్గాలో ప్రార్థనలు, మైదవోలులోని శివాలయం, గ్రామదేవత పోలేరమ్మ గుడిని సందర్శించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూజలు చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్, జేసీఎ కన్వీనర్ రాచమంటి చింతారావు, సొసైటీ చైర్మన్ బసెల శివ రామకృష్ణ, సర్పంచ్‌లు మొహమ్మద్ యూనీస్, రత్నకుమార్, శ్రీనివాస నాయక్, గౌరు లక్ష్మయ్య, ఎంపీటీసీ బి.శ్రీనివాసరావు, గౌరు హనుమంతరావు, రాజేష్, ధర్నాసి రవికుమార్, అంబడి భాగ్యలక్ష్మి, బోరుగడ్డ బాబూరావు, షేక్ జాకీర్, నందికోలు కోటయ్య, కట్టా జయరావు, డేరంగుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కొండవీడులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మనోహర్ నాయుడు

గేట్ ఫలితాల్లో లైమ్ సీటీ విద్యార్థి ప్రతిభ



పిడుగురాళ్ల: జాతీయ స్థాయిలో లైమ్‌సిటీ విద్యార్థి ప్రతిభ సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్ పరీక్ష ఫలితాల్లో పిడుగురాళ్ల(లైమ్‌సీటీ) పట్టణానికి చెందిన వేములూరి కార్తికేయ 27వ ర్యాంక్ సాధించి ప్రతిభను కనబరిచారు. గత ఏడాది చివర్లో గేట్ 2024 పరీక్షలు రాశాడు. డేటా సైన్సు విభాగంలో జాతీయ స్థాయిలో గేట్‌లో ఈ ర్యాంక్ సాధించాడు. గతంలో జేఈఈలోను ప్రతిభ కనబరిచి సూరత్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. ఇప్పుడు గేట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

అదృశ్యం పై కేసు నమోదు

మాచర్ల: స్థానిక పీడబ్ల్యూడీ కాలనీ వాసి గనిపల్లి మరియదాసు మార్చి 1న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఆయన కుమారుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో లస్కర్ ఉద్యోగం చేస్తున్న గనిపల్లి మరియదాసు అదృశ్యం పై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు అర్బన్ సిఐ పి శరత్ బాబు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీఆర్వోకు షోకాజ్ నోటీస్

కారెంపూడి: కారెంపూడి మండలం ఒప్పిచర్ల వీఆర్వో బి.కోటేశ్వరరావుకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు పల్నాడు జిల్లా జేసీ శ్యాంప్రసాద్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఆయన తన వాట్సాప్‌లో స్టేటస్‌గా ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన ఫొటో పోస్ట్ చేయడంతో అందిన ఫిర్యాదు మేరకు వీఆర్వోకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఎన్నికల నియమావళిని ప్రజల్లోకి అధికారులు తీసుకెళ్లడంతో పాటు నియమ నిబంధనల అమలుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఎన్నికల నియమాలను తప్పక పాటించాలని జేసీ శ్యాంప్రసాద్ కోరారు.

రోగికి వైద్యుడే దేవుడు..

పెదకూరపాడు: ప్రేమతో ఆదరించి, మెరుగైన వైద్యం అందిస్తే.. వైద్యులను రోగులు గుండెల్లో పెట్టుకుని చూస్తారని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ గుంటూరు రవివర్మ అన్నారు. రవివర్మ పదోన్నతిపై చిలకలూరిపేట ఏరియా వైద్య శాలకు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయి శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వారికి సన్మానం నిర్వహించారు. డాక్టర్ రవివర్మ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు పేదలకు వైద్య సేవలు అందించడం పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమన్నారు. రోగిని ప్రేమతో ఆదరించి వారికి సేవలు అందించాలన్నారు. పెదకూరపాడు సీహెచ్‌సీ అభివృద్ధికి తోటి సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. ఇన్‌చార్జి సూపరడెంట్ డాక్టర్ విద్యా మాట్లాడుతూ వైద్యునిగా, సూపరింటెండెంట్‌గా సీహెచ్‌సీ అభివృద్ధికి డాక్టర్ రవివర్మ ఏంతో కృషి చేశారన్నారు. రోగులకు, వైద్యుల సంధానకర్తగా వ్యవహరించిన తీరుతో వైద్యశాల అభివృద్ధిలో నడుస్తోందన్నారు. ఆయన హయాంలో రూ.8.30 కోట్లతో నూతన వైద్యశాల నిర్మించినట్లు తెలిపారు. ఆయన బాటలో నడిచి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి శ్రీనివాసరావు, డాక్టర్లు చైతన్య, సూనియా, రమేష్, ఆశీర్వాదం, భాగ్యశ్రీ, జాన్‌కోసీ, రూప, వైద్య సిబ్బంది దుర్గాభవాని, ఫార్మసిస్ట్ లక్ష్మి, ఎల్టీ శ్రీలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

డోంట్‌కేర్!





వెల్లటూరులో..



సంగీనీడుపాలెంలో..

ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటించడంతో ఎన్నికల నిబంధనలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయి. అయినప్పటికీ గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ పార్లమెంటుకు పోటీచేసే రాజకీయపార్టీలకు ఫ్లెక్సీలు పూర్తిగా తొలగించడటంతో పాటు ఆయా పార్టీల రాజకీయ నాయకులకు చెందిన విగ్రహాలకు పూర్తిగా మాస్క్ వేయాల్సి ఉంది. పలు గ్రామాల్లో రాజయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, ఆయా పార్టీలు ప్రజలకిచ్చిన సంక్షేమ పథకాలు వంటి బోర్డులు దర్శనమిస్తున్నాయి. మండలంలోని వెల్లటూరు, సంగీనీడు పాలెం తదితర గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా తొలగించకపోవడంతో ప్రజలు ఆశ్చర్యం వక్తం చేస్తున్నారు. –బొల్లాపల్లి